'ఆ......!'

రాజ వేంకటపద్మనాభ రావుగారు

1–వ రంగము

(అగ్రహారము. బ్రాహ్మణయిల్లు. సోమశాస్త్రుల్లు ఓపక్క అరుగుమీదకూర్చుని ఎండాకు చినుయిస్తళ్లకు బాదమాకులతో మాసిక లేస్తుంటాడు. వయస్సు 55 సం. తక్కువ వుండదు. మాసినగడ్డాము వీభూది రేఖలతో అయిక్యమైపోతుంది. చామనచాయగ, బక్కపల్చగ వుంటాడు. రెండో అరుగుమీద చిరిచాప వేసివుంటుంది: దానిమీద శంకరశాస్త్రి, సోమశాస్త్రికొడుకు — కూర్చుని వో యింగ్లీషు పుస్తకాన్ని చూస్తుంటాడు. గుంటూరుకాలేజీ బి.ఎ. విద్యార్థి. వయస్సు 24 సం. మించకుండా వుంటుంది. సన్నగ, ఎర్రగ – అందంగా వుంటాడు. నవనాగరికత అతనిలో కనిపిస్తుంటుంది. సమయం – ఉదయము.)

శంకరశాస్త్రి:—నాన్నగారూ! చెల్లి ఏడుస్తూంది, ఆ తాతను చేసుకోనని.

సోమశాస్త్రుల్లు:—దానిముఖం. దానికేమి తెలుసు చెప్పూ. ఆయనకేంరా! దబ్బపండులాంటిమనిషి!

శంక:—అయినా మనకుమటుకు తెలీటంలా నాన్నగారూ! చెల్లికీ, ఆయనకు యీడాజోడా! ఆయనకు అరవైసంవత్సరాలుంటాయి; చెల్లికి పన్నెండోసంవత్సరం దాటుతూవుంది.

సోమ:—అరవైసంవత్సరాలుంటే మటుకు? నలభైసంవత్సరాల మనిషిలావుంటాడు. ఆయనకున్న వోపిక నీకుందీ? తెల్లవారుఝామున లేచి స్నానం చేసి – చల్లో! – పీటమీదకూర్చుని పారాయణ చేయటం మొదలుపెట్టాడంటే పదిగంటలదాకా లేవడు. తిండో! తద్దినంబ్రాహ్మడికన్నా యింకా కొంచెం ఎక్కువతింటాడు. ఎంతహరాయింపు!

శంక:— (కోపంగా) నాన్నగారూ! మన ముసలిగేదె నాల్గుమానికల చిట్టుతిందూ పెట్టితే? ఎలా అన్నా, ముసలివాళ్లు ముసలివాళ్లే! ఎంతతిన్నా, ఎంతచేసినా ఏండ్లుతగ్గి మళ్లావయిసాళ్లుకారుగా! చెల్లి ఆయనకు కూతురన్నా నమ్మరు. మనుమరాలుఅంటే ఏమన్ననమ్ముతారేమో!

సోమ:—దానికేమిరా! కామశాస్త్రుల్లు నాలుగో పెండ్లి చిన్నపిల్లనేగా చేసుకుంది! ఈయనకంటే పెద్దవాడేగా! ఆ అమ్మాయి పెద్దదికాలేదా? సంసారం చేయటంలేదా? అప్పుడే యిద్దరుపిల్లలు!

శంక:—చదువుకున్న శాస్త్రుల్లు ఆయన. మంత్రాలకే పిల్లలను కంటున్నాడేమో! నాన్నగారూ! మొన్న మీకు ఎవ్వరో దానమిచ్చేరే ఓఆవు పెయ్యను, దానిని అమ్మేరుకదూ? ఎంతకు?

సోమ:—ముందు ముప్పైచెప్పాను. ఎవ్వరూ మొగ్గరాలా. చివరకు పాతిక్కిచ్చా.

శంక:— నాన్నగారూ! ఆ ఆవుపెయ్యకు చెల్లికి భేదం ఏమిటి? దానిని పాతిక్కమ్మితే, చెల్లిని నాలుగువేల కమ్ముతున్నారు.

సోమ:—(తెల్లముఖంవేసి) అదేమిటి? చెల్లిని అమ్ముతామురా! యేదో సంబంధం మంచిదని యిస్తున్నాముగాని; మనం ఆయనకు దగ్గరబంధువులం అవుతున్నాము. ఏదోబహుమానంగా యిస్తానన్నాడు ఆ పెద్దమనిషి. మనం వద్దంటే బాగుంటుందీ? ఇదిగో చూడూ, యిక యిబ్బందివుండదు. ఈ సంవత్సరం బి. ఎ. అయిపోతే వచ్చేసవత్సరం దానిపైచదువుగాని, అయితే అది గుంటూరులోవుండదా?

శంక:—'అంగట్లో అన్నీవున్నాయి; అల్లుడు నోట్లోశని' అన్నట్లు వుంది. ఈ సంవత్సరం యినుప పెట్టెతాళం పోయిందాఏమిటి? డబ్బుకోసం నే నెంతయిబ్బందిపడ్డానో మీకేంతెలుసు! ఇప్పుడు పంపారు, యిక అప్పుడుపంపుతారు! దానికేమిగాని, హాయిగా మేనరికం యిచ్చుకోకూడదూ? కృష్ణశాస్త్రి వచ్చేసంవత్సరం బి.ఎ. చదువుతాడు. పిల్లవాడు అందంగా వుంటాడాయెను. తెలివిగలవాడు; బుద్ధిమంతుడు. పిల్లా, పిల్లవాడికీ, యిద్దరికీ యిష్టమే!

సోమ:—ఇష్టానికి, అయిష్టానికికాదు. అసలు పిల్లవాడికేమి ఆస్తుందో చెప్పు. అవున్న కొంచెం ఆస్తీ చదువుకిందే ఆఖరవుతుంది. ఉద్యోగాలా, పాడా, తరువాత అడుక్కోతింటమేనా? అదీచేత కాదు యీ పాడుఇంగ్లీషుచదువులాన. ఆయనకుచూడు, ఎంతఆస్తీ! ఎంతఆస్తీ! పైనసంపాదనఎంత! యిప్పటికీ బయలుదేరాడుఅంటే పూటకు రెండురూపాయలు, మాడుమానికలబియ్యం మూటకట్టందీ యింటిగుమ్మం తొక్కడు. ఓ పెద్దపెంకుటిభవంతి, పాడి, పంట, చేతినిండాడబ్బు — ఆయనకేమిరా, లక్ష్మీపుత్రుడు! అమ్మాయి ఎంతసుఖపడొచ్చు!

శంక:—స్త్రీకి నిజమైనసౌఖ్యం తగినభర్తవల్ల వస్తోంది, కాని డబ్బువల్లరాదు. చూడండి నాన్నగారూ! ఈవూళ్లో పంతులు ప్రకాశరావు నెలకు యిరవైసంపాదిస్తేనేమి? భార్యాభర్తలు — యీడూ జోడు — చిలుకాగోరంకలులాగ ఎలా హాయిగా వుంటున్నారో? అది సౌఖ్యమంటె.

సోమ:—అబ్బాయి! నువ్వు చిన్నవాడివి అనుభవంతక్కువ. డబ్బువుంటే కొండమీదికోతి దిగి వస్తోంది. అసలు ఫలానివారిభార్యఅన్నా గొప్పే! ముందుమాటయిచ్చే, ఆ పెద్దమనిషికి. ఇపుడుకాదంటే బాగుండదు. సాయంకాలం పిల్లనుచూచుకోటానికి మన యింటికొస్తారు చూడు. వారినిజాగ్రత్తగా బాగా మర్యాదచేయాలి. నువ్వు ఆయనను ఎక్కిరించి పోట్లాటపెట్టుకునేవుసుమా! బాగుండదు.

శంక:—(కోపంగా) నే నేమిచెప్పినా మీకు నచ్చదు. మీయిష్టంవచ్చినట్లు చేయండి.

సోమ:—అలాఅన్నావు బాగుంది. ఏదో పెద్దవాడిని నే నున్నాగా నాకే వొదిలిపెట్టు అదంతా.

(తెరపడుతుంది)

2-వ రంగము

(సాయంకాలము. సోమశాస్త్రుర్లు ఇల్లంతా అలికి ముగ్గులేసివుంటుంది. ద్వారానికి మామిడిఆకు తోరణంకట్టి వుంటుంది. ద్వారం కిందిభాగానికి పసుపు, కుంకం పెట్టివుంటుంది. ఓ అరుగుమీద చిరిచాప, రెండోఅరుగుమీద తాటిఆకులచాప పరిచి వుంటాయి. శంకరశాస్త్రి తాటిఆకు చాపమీద కూర్చునివుంటాడు. సోమశాస్త్రుర్లు, యిటూఅటూ పచార్లుచేస్తుంటాడు.)

సోమశాస్త్రులు:— (ఆలోచనగా) సుబ్బావధానిగారు యింకారాలేదేమిటి చెపుమా!

శంకరశాస్త్రులు:—(విచారహృదయంతో ఆకాశంవంక చూస్తొంటాడు.)

సోమ:—అబ్బాయీ! ఇపుడెన్నిగంట లవుతుంది?

శంక:—అవుతుంది నాలుగుగంటలు.

సోమ:—వొస్తూవుంటారు అనుకుంటూ (వీధివేపు చూచి) ఆ! వారేలాగున్నారు వస్తున్నారు. (మళ్లానిదానించిచూచి) వారే! సుబ్బావధాని, పిచ్చయ్యశాస్త్రుర్లుగార్లు.

(ప్రవేశం సుబ్బావధాని, పిచ్చయ్యశాస్త్రుర్లు. సుబ్బావధాని కాబోయేపెండ్లికొడుకు. శరీరం పచ్చగావుంటుంది. ఇస్త్రీచేయని చాకలింటిగుడ్డలాగా ముఖంనిండాముడతలు, మీసాలులేవుగాని ఫ్రెంచికటింగులాగ నశ్యం ముక్కుదగ్గర. చెవులకు బంగారు కొండలాలు మామిడిపండ్లులాగ వ్రేల్లాడుతుంటాయి.

మూడుమీదిజుట్టు మాయమైవుంటుంది. తలకుచుట్టూ పంచపాళీలాగ తెలుపు, నలుపుమిళితమైన జుట్టు కనిపిస్తుంది. తెల్లని జరీధోవతికట్టుకొని, ఓజరీ ఉత్తరీయం మెడకుచుట్టుకొని వుంటాడు. కాఫీరంగు కొల్లాయిగుడ్డ భుజంమీద వేళ్లాడుతుంటుంది. నడుందగ్గర ఓ పెద్దమరుపులాగ పొడుంబుర్ర వుంటుంది. కండ్లకు సులోచనాలువుంటాయి. చేతిలో వెండిపన్నుకర్ర. అరవైసంవత్సరాలకు తక్కువలేని మనిషిలాగా వుంటాడు. (పిచ్చయ్యశాస్త్రుల్లు పెండ్లిళ్లుకుదిర్చే బ్రాహ్మణుడు. సాక్షాత్తు తద్దినాల బ్రాహ్మణుడులాగ వుంటాడు.)

సుబ్బావధాని:—నమస్కారాలండి, మామగారు!

సోమ:—చిత్తం! చిత్తం! దయచేయండి పెద్దలు. ఇవిగోనీళ్లు కాళ్లుకడుక్కోండి. (ఇద్దరికి చెంబులతో నీళ్లుయిస్తాడు.) కాళ్లు తుడుచుకోండి. (కొల్లాయిగుడ్డయిస్తాడు.) అలా చాపమీద దయచేయండి.

(సుబ్బావధాని, పిచ్చయ్యశాస్త్రుల్లు చాపను అలంకరిస్తారు.)

సోమ:—తమరు మడికట్టుకొని దాహంపుచ్చుకుంటారా?

సుబ్బా:—అబ్బే! అవుసరంలేదు. వారేనా అండీ మీ అబ్బాయి గుంటూరులోచదువుత.

సోమ:—చిత్తం.

సుబ్బా:—మిమ్మలను ఎప్పుడూచూడలా.

శంక:—సాధారణంగా నే నిక్కడవుండను; ఎప్పుడన్నా శెలవులకువస్తూంటూ.

పిచ్చె:—అయ్యో! తమరు మమ్మలను తొందరగాపంపాలి. పొద్దుపోతూంది. నాల్గుమైళ్లుపైగా పోవాలి.

సోమ:—అలాగే. అమ్మాయిని తీసుకొరమ్మంటారా?

పిచ్చె:—చిత్తం!

(సోమశాస్త్రుల్లు ఇంటిలోనికిపోయి 12 సంవత్సరముల అమ్మాయిని తీసుకొచ్చి గుమ్మందగ్గిర నుంచో పెడతాడు. ఆ అమ్మాయి తలవొంచుకొని వుంటుంది. ఎర్రగా, సన్నగా, నాజూకుగా వుంటుంది. చాల అందంగా వుంటుంది అనేచేప్పాలి.' పరికిణీ, గౌను తొడుక్కొని, చాల బంగారునగలుపెట్టుకొని వుంటుంది.)

పిచ్చె:—అమ్మాయీ! నీ పేరేమిటమ్మా?

అమ్మాయి:—శకుంతల.

పిచ్చె:—ఓ, దివ్యమైననామం!

సుబ్బా:—ఎందుకండీ, కండ్లవెంబడి నీళ్లుకారుతున్నాయి, కండ్లకుజబ్బా?

సోమ:—అబ్బే! లేదండీ. ఉదయం తలంటిపోసుకుంది, నురుగు కంట్లోపడ్డది.

శంక:—కండ్లకుకాదు జబ్బు; హృదయానికి.

సోమ:—(కుమారునివేపుకండ్లువుంచిచూస్తాడు.) అదీకాక, పాపము! తల్లిపోయిసంవత్సరమేగా అయ్యింది. ఉదయాన్నించి తల్లినితలుచుకోని ఏడుస్తుంది. పెండ్లిసమయంలో ఆవిడలేకపోవటం, ఎంతో లోపంగావుంది.

సుబ్బా:—అయ్యో! కాదుమరి.

సోమ:—ఆవిడ బతికున్నప్పుడు అంటూవుండేది, మీబోటి గొప్పసంబంధాని కియ్యాలని. పాపం! చూచిసంతోషించే యోగ్యత లేకపోయింది.

శంకర:—ఇలాటి గొప్పసంబంధము దొరుకుతుందో, దొరకతో అని సగము యీదిగులుతోనే చచ్చిపోయింది.

సోమ:—(కొంచెం తెల్లముఖంవేస్తూ) అదికూడ నిజమేనండి.

సుబ్బా:—అవును, అనుకున్నవన్నీ జరుగుతాయా మరి?

సోమ:—చిత్తం. అలాగే.

సుబ్బా:—ఏమన్నా చదువుకుందా అండి?

సోమ:—భారతం, భాగవతం గడగడ చదివేస్తుందండి. కొంచెం యింగ్లీషుకూడ నేర్చుకుంది అన్నయ్యదగ్గిర.

శంకర:—మీకు కొంచెం చూపుతగ్గినట్టువుంది; ఇబ్బందేమి లేదులెండి. మా అమ్మాయి మీకు కావలసిన పారాయణగ్రంథాలన్నీ చదివి వినిపిస్తుంది.

సుబ్బా:—చూపుకేమండి? ఈ కళ్ళజోడు వూరికే......ఏదో......

పిచ్చే:—అందానికి పెట్టుకున్నారు; చూపుకేమండీ, నిక్షేపంలావుంది.

సుబ్బా:—అయినా, చదవవలసిన అవుసరమే లేదు. అన్నీ నాకు కంఠతావొచ్చు.

సోమ:—చిత్తం. పెద్దలు తమకేవిరావు?

పిచ్చే:—సోమశాస్త్రిర్లుగారూ! అమ్మాయి వొంటిమీదవున్న సొమ్మంతా, అమ్మాయితోనే వొస్తుందా అండి?

సోమ:—(తెల్లముఖం వేస్తాడు)

శంకర:—అబ్బే! అవి ఎలావస్తాయిఅండి? ఊరికే చూపించాము, మా అమ్మాయికి, చాల సొమ్ములు మొయ్యగల శక్తివుందని. రేపు మీరు కొంచెంచేయిస్తే మొయ్యలేదని.

సుబ్బా:—సొమ్ముకేమిలెండి, నాదగ్గర మూడు వేల ఏడువందల పదహారు రూపాయల కిమ్మత్తుగల సొమ్మువుంది.

సోమ:—(తేటముఖంతో) తమదగ్గరసొమ్ముకేమి కొరతండి? అపరకుబేరులు!

పిచ్చే:—పిల్లకేమన్నా లోపంచేస్తారా? అమ్మాయిగారు ఎక్కడికిపోవాలన్నా నడవకుండా ఓ ఒంటెద్దుబండి కొంటానన్నారు.

సోమ:—ఒంటెద్దుబండీ కొంటారు, రెండెడ్లబండీ కొంటారు. వారు తలుచుకుంటే ఏమిచేయలేరు?

శంకర:—ఏమి సామర్థ్యం! దున్నలబండీ కొంటారు, వారికేం మహారాజులు!

సుబ్బా:—(కొంచెం కోపంగా) దున్నలబండీ?

సోమ:—అంటే, అమ్మాయీ, మీరు హాయిగా ఒంటెద్దుబండిఎక్కి పార్వతీపరమేశ్వరులులాగ తిరుగుతుంటే, వ్యవసాయానికి దున్నలబండి.

సుబ్బా:—పొలాలన్నీ మక్తాకు యిచ్చాను.

సోమ:—చిత్తం. అదే హాయిలెండి

పిచ్చే:—సంబంధము స్థిరపడ్డట్టేగా? తాంబూలాలు పుచ్చుకోండి.

సోమ:—ఇప్పుడేమి? మునుపే స్థిరపడ్డది.

(సోమశాస్త్రుర్లు, సుబ్బావధాని తాంబూలాలు పుచ్చుకుంటారు).

పిచ్చే:—ముహూర్తం ఎప్పుడు స్థిరపరిచారు?

సోమ:—ఉదయాన్న రామావధానిగారిదగ్గరకు వెళ్లి ముహూర్తంపెట్టించాను. ఎల్లుండి రాత్రి ఒంటిగంటకు చాలదివ్యంగావుంది అన్నాడు.

సుబ్బా:—'శుభస్య శీఘ్రం' అన్నారు. ఎంత తొందరగాఅవుతే అంతమంచిది.

సోమ:—చిత్తం అన్నీ బాగానేవున్నాయి—కాని ఒకటే కొంచెం భయంగావుంది. ఈవూరిలో శారదాబిల్లు హడావుడిగావుంది.

సుబ్బా:—దానికేమి? మావూరిలో చేద్దాం. అచ్చట నన్నేమి చేయలేరు లెండి.

పిచ్చే:—ఆవూరిలో సుబ్బావధానిగారంటే ఎంత పలుకుబడీ! ఎంత గౌరవము! ఎంత శారదాబిల్లు అయినా ఆవూరిలో వారినేమి చేయలేదు.

సోమ:—అంచేతే, అక్కడేచేస్తే ఏయిబ్బందీ వుండదు. అందులో రాత్రి ఒంటిగంటకుకదా ముహూర్తం, ఎవ్వరికే తెలియకుండానే చేయవచ్చు,

పిచ్చి:—పెండ్లిఅయినదాకా ఎవ్వరికి తెలియ కూడదు. తరువాత ఏదన్నా వస్తే సైజామీలో చేశా మని చెప్పొచ్చు.

సుబ్బా:—అదీ నిజమే. మామగారూ! ఇవిగో వెయ్యిరూపాయలు. లెక్కించుకోండి. (నోట్లబొత్తి యిస్తాడు).

సోమ:—(సంతోషంతో) చిత్తం! చిత్తం! తమరు లెఖ్ఖలేస్తే మళ్లీ దానికి తిరుగా (నోట్లను లెఖ్ఖలేస్తాడు) సరిగావున్నాయి. మీదగ్గిర పొరపాటు వొస్తుందా?

సుబ్బా:—ఎల్లుండి సాయంకాలం కొంచెం మసగపడ్డతర్వాత మీరందరు వచ్చేటుండి అన్నీ సిద్ధంచేసివుంచుతా.

సోమ:—చిత్తం. అలాగే.

సుబ్బా:—ఇక శెలవిస్తారూ?

సోమ:—చిత్తం.

(అందరులేస్తారు).

పిచ్చి:—సోమశాస్త్రిర్లుగారూ! ఏదో బీద వాడిని. నన్ను మరిచిపోకండి.

సోమ:—అయ్యో! ఎంతమాట! ఇదంతా మీ చలవే!

(సుబ్బావధాని, పిచ్చెయ్యశాస్త్రిర్లు వెళ్లి పోతారు).

శంకర:—నాన్నగారూ! రాత్రి బండికి నేను గుంటూరు వెళ్లాలి. నాపరిక్ష ఏమయిందో కనుక్కోరావాలి.

సోమ:—(నోట్ల బొత్తిని సంతోషంగా కోల్లా గుడ్డకు ముడేస్తూ) అలాగే నాయన! వెళ్లిరా.

(తెర పడుతుంది).

3-వ రంగము

(రాత్రి 12 గంటలవుతుంది. ఊరంతా నిద్ర పోతుంటుంది. సుబ్బావధాని ఇంట్లో కొంచెము హడావుడిగా వుంటుంది. తలుపులన్నీ బిగించి వుంటాయి. హాల్లో సోమశాస్త్రిర్లు పీటమీద కూర్చుని వుంటాడు, బొడ్లో రవికగుడ్డపెట్టుకొని. సుబ్బావధాని పెండ్లికొడుకై పీటమీద కూర్చొనివుంటాడు. పిచ్చెయ్యశాస్త్రి మంత్రాలు చెప్పుతుంటాడు. ఇంకా యిద్దరు బ్రాహ్మణులు పెళ్లిపెద్దలులాగ ముందు కూర్చొనివుంటారు. శంకరశాస్త్రి గోడకు ఆనుకొని నుంచునివుంటాడు. అతని ముఖంలో కోపం, విచారం కనిపిస్తువుంటవి. పక్కగదిలో శకుంతల పెండ్లి కూతురై కూర్చొని దుఃఖము పొరలి, పొరలి వస్తూంటే పమిటెచెంగుతో కన్నులు తుడుచు కుంటూవుంటుంది. సుబ్బావధాని పక్కన రూపా యలమూట వుంటుంది).

సోమ:—శాస్త్రిర్లుగారూ! మెల్లగా చదవాలి మంత్రాలు. ఈకార్యం ఎవ్వరికీ తెలియకుండా అయి పోవాలి.

పిచ్చి:—చిత్తం.

(మంత్రాలు మెల్లగా చదువుతుంటాడు. అంతలో కారు ఆగినమోత వినిపిస్తుంది. వెంటనే బయటినుండి తలుపుమీద గుద్దులు-"తలుపు, తలుపు." అని కేకలు వినిపిస్తాయి).

(లోపల అందరు గాబరాపడతారు. శంకర శాస్త్రి తలుపుతీస్తాడు).

సోమ:—(పిరికితనంగా) ఆ! ఆ! వొద్దు. (ఓ సర్కిల్ యిన్‌స్పెక్టరు, సబ్ యిన్‌స్పెక్టరు, కాన్‌స్టేబిలు, త్రిమూర్తులులాగ ప్రత్యక్షమవుతారు ఆయు ధాలతో. సర్కిల్ యిన్‌స్పెక్టరు లావుగా, ఎర్రగా, బుర్రమీసాలతో వుంటాడు. సబ్ యిన్‌స్పెక్టరు వోమాదిరి సన్నగా, ఎర్రగావుంటాడు. మీసాలు, కళ్లజోడు వుంటాయి. కాన్‌స్టేబిలు లావుగా, కొంచెం నల్లగావుంటాడు.)

సర్కిల్ యిన్‌స్పెక్టరు:—(అధికారంతో) ఎవర దండీ యీ పెండ్లి?

సుబ్బా:—(వొణుకుతు) పెండ్లిలేదు......... పెండ్లికి వెళ్లదామని.........తయారు.

సర్కిల్:—ఎక్కడికి?

సుబ్బా:—నైజాము.

సర్కిల్:—ఏయ్! అబద్ధమాడుతున్నావ్! కబడ్దార్! నిన్నేమిచేస్తానో చూడు. ఇపుడు పెండ్లి యిక్కడ చేసుకుంటూ లేదంటావా?

సోమ:—(వొణుకుతూ) అయ్యా!......పెండ్లి ......కూతురులేదు.........పెండ్లి ఎలా.......... యిక్కడ.

సర్కిల్:—(కోపంతో) పెండ్లికూతురులేదూ? కాన్‌స్టేబిల్! ఇల్లంతా వెతుకు. పెండ్లికూతురుందేమో.

(కాన్‌స్టేబిల్ యిల్లు వెతుకడాని కెళుతాడు)

సుబ్బా:—అయ్యా! క్షమించాలి......ఏదో తప్పు.........

(కాన్‌స్టేబిల్ గదిలోనుంచి పెండ్లికూతుర్ని తీసుకొస్తాడు).

సర్కిల్:—(కన్నులు ఉరుముతు) పెండ్లికూతురు లేదూ (కోటుజేబులోనుండి చిన్నపుస్తకం పెన్సలు తీస్తాడు). మీ పేరు?

సుబ్బా:—అయ్యా! అయ్యా! క్షమించాలి.

సర్కిల్:—(అధికారంతో) ముందు పేరుచెప్పు.

సుబ్బా:—సుబ్బావధాని.

సర్కిల్:—పెండ్లికుమారు లన్నమాట. సరే. మీ పేరు?

సోమ:—సోమశాస్త్రిర్లు.

సర్కిల్:—పెండ్లికూతురు తండ్రికదూ?

సోమ:—చిత్తం.

సర్కిల్:—మీ పేరు?

శంకర:—శంకరశాస్త్రి.

సర్కిల్:—పెండ్లికూతురికి ఏమవుతారు?

శంకర:—అన్న.

సర్కిల్:—అమ్మాయీ! నీపేరు?

శకుం:—శకుంతల.

సర్కిల్:—మీ పేరు?

పిచ్చ:—పిచ్చయ్యశాస్త్రిర్లు.

సర్కిల్:—సరే! పురోహితులన్నమాట. మీ పేరు?

1 వ బ్రాహ్మణుడు:—వెంటయ్యశాస్త్రి.

సర్కి:—నీకేం సంబంధము యిక్కడ?

1 వ బ్రా:—సంభావన కొచ్చేము, మేమిద్దరం.

సర్కిల్:—మీ పేరు?

2 వ బ్రాహ్మణుడు:—విరోచనశాస్త్రి.

సర్కిల్:—(వొచ్చేనవ్వు ఆపుకుంటూ) విరోచన శాస్త్రి! అదేమి పేరయ్యా?

2 వ బ్రా:—పిల్లలు బతక్కపోతుంటే మావాళ్లు యిలా పిలుస్తున్నారు.

సర్కిల్:—మీతప్పులకు శిక్ష తెలుసా? శారదా బిల్లు అతిక్రమించినందుకు పెండ్లికొడుక్కి రెండువేల రూపాయలు జులమానా, ఆరునెల్లు ఖయిదు, పెండ్లి కూతురుతండ్రికి వెయ్యిరూపాయలు జులమానా, నాల్గునెలలు ఖయిదు. పెండ్లికూతురుకు పెండ్లి చేయించే బ్రాహ్మడికీ మూడునెల్లు ఖయిదు.

(సోమశాస్త్రిర్లుకి. సుబ్బావధానికి, పిచ్చెయ్య శాస్త్రికి వొణుకుడు జాస్తి అవుతుంది. దిక్కు మొఖము వేస్తారు.)

సోమ:—అయ్యా! చెంపలేసుకుంటా. బుద్ధి తక్కువైంది.

సర్కిల్:—మీరు పిల్ల నమ్ముతున్నారుట. ఈ నేరమునకు మీకు రెండువేలు జులమానా, రెండు ఏండ్లు ఖయిదు. పెండ్లికొడుకు కొంటున్నాడు కాబట్టి వెయ్యిరూపాయలు జులమానా, ఆరునెల్లు ఖయిదు.

సుబ్బా:—అయ్యా! మీరు దేముళ్లు దయ తలచాలి.

సర్కిల్:—(పై మాటలు వినుపించుకోకుండా) తాతాబిల్లుప్రకారం పెండ్లికొడిక్కి 4 సం. కఠినశిక్ష.

సుబ్బా:—(ఆశ్చర్యంతో) తాతాబిల్లుఏమిటి?

సర్కిల్:—ఈబిల్లు మొన్ననేవొచ్చింది అమలు లోకి. తాతలు, అంటే మీబోటివృద్ధులు చిన్నపిల్లలను పెండ్లి చేసుకోకూడదు; చేసుకొంటే 4 సం. కఠినశిక్ష.

సోమ:—అయ్యా! మేమెప్పుడూ వినలేదే!

సర్కిల్:—విన్న శారదాబిల్లు అతిక్రమించారు. ఇక అది వినలేదు. రేపు కోర్టులో బోనుఎక్కితే అన్నీ వింటారు.

సుబ్బా:—(వొణుక్కుంటూ వొచ్చి సర్కిల్ యిన్స్పెక్టరు రెండుచేతులూపట్టుకొని) అయ్యా! క్షమించాలి. బతిమాలుతున్నా. ఇవి చేతులుకావు. కాళ్లు.

సర్కిల్:—(చేతులు విదలించి) కాన్స్టేబిల్ ఈయన్ని అవతలకు లాగు.

సోమ:—మేము ఏమి చెప్పినా వొప్పుకోవటంలా అబ్బాయీ! నువ్వన్నా యింగ్లీషులో మాట్లాడరా చదువుకున్నవాళ్లు మీఅందరు ఒకటి.

సర్కిల్:—నేనుమాట్లాడేది తెనుగే! మీరు తెనుగులో చెప్పుతే నాకు అర్థం అవుతుంది.

శంకర:—(సుబ్బావధాన్ని పక్కకు తీసుకో పోయి మెల్లగా) అవధానులుగారూ! పోలీసువారికి మాటలుచెప్పడే లాభంలేదు. ఆరూపాయలమూట వారిచేతిలోపెట్టి క్షమించమని కోరండి. కొంచెం అయినా పని అవుతుంది.

సుబ్బా:—సరే! (ఊడిపోతున్న బిళ్లగోచీని చిక్కిరిబిక్కిరిగా దోపుకోని, రూపాయలమూట సర్కిల్ యిన్స్పెక్టరు చేతిలోపెట్టి) అయ్యా! ఇన్స్పెక్టరుగారూ! ఈ మూడువేల రూపాయలను గ్రహించి నన్ను ఎలాగో అలా ఒడ్డుచేర్చండి పరువు మర్యాద పోకొట్టుకొని ఖైదిలోపడి మాలకూడు తినలేను.

సర్కిల్:—అబ్బె! అబ్బె! ఇదేమిటి అయ్యా! నేనెప్పుడూ తీసుకోను యిలాంటిది.

సుబ్బా:—అయ్యా! మీరు అలాఅంటే లాభం లేదు. దయతలచాలి. అసలు యీపాడుపెండ్లి ఒద్దు అంటూవుంటే యీ పిచ్చెయ్యశాస్త్రి చేశాడు యిదంతా. లేకపోతే నాబ్రతుక్కితోడు పెండ్లేమిటి కాటికి కాళ్లు జాచుకున్న నాకు?

సర్కిల్:—మరి ఎందుకు చేసుకున్నావ్?

సుబ్బా:—ఎదో పిల్లనిస్తానంటే చేసుకుందామని బుద్ధిపుట్టింది, పెండ్లాం అనేదివుంటే మంచిది కదా అని; వంటఅన్నా చేసిపెట్టుతుంది.

సర్కిల్:—(కోపంగా) చూడు, శాస్త్రుల్లూ! ఇన్నేళ్లువొచ్చాయి, బుద్ధిలేదూ? ఆ చిన్నపిల్లను నాశనంచేస్తానికి నీమనసు ఎలావొప్పింది?

సుబ్బా:—బుద్ధివొచ్చింది (లెంపలేసుకుంటాడు) ఈజన్మలో యిలాంటిపని ఎప్పుడూ చెయ్యను.

సర్కిల్:—సోమశాస్త్రుల్లగారూ! మీవిషయం ఏమిటి?

సోమ:—అయ్యా! క్షమించాలి. నేనూయిస్తాను డబ్బు...యింటిదగ్గర వుంది.

సర్కిల్:—అసలు చేసిందిఅంతా నువ్వు. నీమీద యిపుడు రెండుకేసులున్నాయి. పిల్లను అమ్మటం, ఒకటి, శారదాబిల్లును అతిక్రమించటం రెండు.

సోమ:—(బిక్కముఖంవేసి చేతులు నలుపుకుంటూ) అయ్యా! నన్నుకూడ క్షమించాలి. బుద్ధి వొచ్చింది. మీరేమిచెయ్యమని శెలవిస్తే అది చేయడానికి సిద్ధంగా వున్నా.

సర్కిల్:—అలావుతే ఒకటిచెయ్యండి—(సబ్ యిన్‌స్పెక్టర్ని చూపుతూ) వీరు పోలీసు సబ్‌యిన్‌స్పెక్టరుగారు. వైదికులే. ఈముహూర్తానికే మీ అమ్మాయిని యీయనకిచ్చి పెండ్లిచేయండి. కేసు అంతా రద్దుచేయిస్తాను.

సోమ:—(తెల్లముఖంవేసి) చి... త్రం!

సర్కిల్:—అందరికీ యిష్టమవుతేనే చేద్దాం సుమా! ఏమండీ శంకరశాస్త్రిగారూ! మీకిష్టమేనా?

శంకర:—మిక్కిలి యిష్టం.

సర్కిల్:—శకుంతలా! నీకో?

శకు:—ఆ!

సర్కిల్:—సబ్ యిన్‌స్పెక్టరుగారూ! మీకు?

సబ్ యిన్:—బహుయిష్టం.

సర్కిల్:—ఏమండీ సుబ్బావధానులుగారూ! మీఉద్దేశ్యమేమి?

సుబ్బా:—(చేతులు నలుపుకుంటూ) అయ్యా! అయ్యా! తమరిమాటకడ్డా?

సర్కిల్:—సోమశాస్తుర్లుగారూ! అందరికీ యిష్టమే. ఇక కార్యం జరపండి.

సోమ:—చిత్రం.

(సోమశాస్తుర్లు కొత్తబట్టలు సబ్ యిన్‌స్పెక్టరికి యిస్తాడు. సబ్ యిన్‌స్పెక్టరు డ్రస్సువిప్పి ధోవతి కట్టుకొని ఓ ఉత్తరీయం కప్పుకొని, ఓ ఉత్తరీయం తలగుడ్డ చుట్టుకుంటాడు. పిచ్చెయ్యశాస్త్రి అతనిని పెండ్లికొడుకుచేసి పీటమీద కూర్చోపెడతాడు. సర్కిల్ యిన్‌స్పెక్టరు, కాన్‌స్టేబిలుకూడ డ్రస్సులు విప్పుకొని మామూలుబట్టలు ధరించి పెండ్లిపెద్దలులాగ కూర్చుంటారు ముందు. పిచ్చెయ్యశాస్త్రి మంత్రాలు మొదలుపెడతాడు. తెల్లవారేటప్పటికి పెండ్లిఅంతా అయిపోతుంది. ఊళ్లోజనం చాలమంది వొచ్చి చూస్తుంటారు.)

సర్కిల్:—సబ్ యిన్‌స్పెక్టరుగారూ! (నవ్వుతూ కన్ను ఎగరవేస్తాడు. అప్పుడు సబ్ యిన్‌స్పెక్టరు నవ్వుతూ మీసాలు లాగేసుకొని, తలపాగా, కళ్లజోడు తీసేస్తాడు.)

సోమ:—(తెల్లముఖంవేసి ఆశ్చర్యంతో) ఆ! మాకృష్ణశాస్త్రి!

(సర్కిల్ యిన్‌స్పెక్టరు * శంకరశాస్త్రి ఒకరినొకరు చూచుకొని నవ్వుకుంటారు. శకుంతలా కృష్ణశాస్త్రి దొంగచూపులు చూచుకొని నవ్వుకుంటారు. మిగతావాళ్లంతా తెల్లపోయి చూస్తారు.)

(తెర వాలుతుంది)

* సర్కిల్ ఇన్‌స్పెక్టరు, శంకరశాస్త్రి ఒకబళ్లో చదువుకున్నవారు.